క్లుప్తంగా

పలువురికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న బుజ్జిరాజు, బోనం రాజు తదితరులు

మలికిపురం: సఖినేటిపల్లి, మలికిపురం మండలాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఆ సాయాన్ని శనివారం సాయంత్రం మలికిపురంలోని వసుధ ఫౌండేషన్ ప్రతినిధి జంపన బుజ్జిరాజు ఇంటి వద్ద జరిగిన ఒక కార్యక్రమంలో యర్రంశెట్టి రామలక్ష్మి, మాదు వెంకటలక్ష్మి, దేశినీడి అయ్యప్ప, మేడూరి సూర్యనారాయణ, పెదపాటి చిట్టిబాబులకు రూ.10 వేల చొప్పున సాయం అందించారు. అలాగే శెట్టిం రాకేష్‌కు రూ.7 వేలు అందించారు. కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ ప్రతినిధి బోనం రాజుతో పాటు పలువురు పెద్దలు పాల్గొన్నారు. సాయం అందించిన ఫౌండేషన్ చైర్మన్‌కి అనారోగ్య బాధిత కుటుంబాల సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బుద్ధుని కాంస్య విగ్రహం ఆవిష్కరణ



విగ్రహావిష్కరణ అనంతరం సందేశం ఇస్తున్న బౌద్ధ బిక్షువు సంఘపాల

మామిడికుదురు: ఆదుర్రులోని ప్రాచీన ఆది బౌద్ధ స్థూపం సమీపంలోని బుద్ధ విహార్‌లో థాయ్‌లాండ్ మినిస్ట్రీస్ వారు సమర్పించిన తథాగత భగవాన్ బుద్ధుని కాంస్య విగ్రహాన్ని బౌద్ధ బిక్షువు సంఘపాల శనివారం ఆవిష్కరించారు. ప్రాచీన భారతీయ వారసత్వ బౌద్ధ సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా బౌద్ధ స్థూపం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. బౌద్ధ స్థూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. అనంతరం విగ్రహావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా బౌద్ధ బిక్షువు సంఘపాల మాట్లాడుతూ బుద్ధుని బోధనలను ప్రతి ఒక్కరూ ఆచరించాలన్నారు. కార్యక్రమంలో బుద్ధ విహార్ ట్రస్ట్ అధ్యక్షుడు చింతా శ్రీరామమూర్తి, వ్యవస్థాపకుడు ఎస్ఎస్ఆర్ భూపతి, సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మట్టా శైలజ, బత్తుల జనార్దనరావు, భయ్యా మోహన్, తాడి సురేష్, పులపర్తి కృష్ణ పాల్గొన్నారు.

యువకుల కుటుంబానికి ఎంపీ పరామర్శ

అంబాజీపేట: సింహాచలం సింహాద్రి అప్పన్న చందనోత్సవంలో దుర్మరణం పాలైన అంబాజీపేట కొర్లపాటివారిపాలేనికి చెందిన పత్తి దుర్గా స్వామినాయుడు, కుంపట్ల మణికంఠ ఈశ్వరశేషరావు కుటుంబ సభ్యులను అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాథుర్ శనివారం పరామర్శించారు. ఆ యువకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. పత్తి దత్తుడు, కుంపట్ల శ్రీనివాసరావులకు మనోధైర్యం కల్పించారు. సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, జంగా గౌతమ్, శిరిగినీడి వెంకటేశ్వరరావు, రవణం రాము, గుడాల ఫణి, మైపాల తాతాజీ పరామర్శించిన వారిలో ఉన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు



అయినవిల్లిలో బీట్ ద హీట్‌పై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

ఆలమూరు: బాటసారులను వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు వీలుగా మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం చలివేంద్రాల ఏర్పాటు జరిగింది. ఆలమూరులో ఎంపీడీఓ ఎ.రాజు, సర్పంచ్ నేలపూడి లావణ్య ఆధ్వర్యంలో స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోనూ, గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద, కొత్తూరు సెంటర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద అధికారులు చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే ఆయా గ్రామాల్లోని ముఖ్య కూడళ్ల వద్ద, గ్రామ సచివాలయాల వద్ద చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీరుస్తున్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: గ్రామ పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల వద్ద వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడం కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ జీవీ సరోవర్ ఆదేశించారు. శనివారం బీట్ ద హీట్ కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ అవగాహన కల్పించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. అలాగే ప్రజలు ఎక్కువ తిరిగాడే ప్రదేశాల్లో దాతలు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ ఆరోగ్యశాఖ వారు అందించే ఓఆర్ఎస్ ప్యాకెట్లను మంచినీటిలో కలుపుకుని తాగాలన్నారు. దీని వల్ల వేసవి ఉష్ణతాపం నుంచి కొంత వరకూ బయట పడవచ్చన్నారు. కార్యక్రమంలో అయినవిల్లి సర్పంచ్ కాకర శ్రీనివాస్, అయినవిల్లి పంచాయతీ కార్యదర్శి కె.రామచంద్రరావు, మండల పరిషత్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్షరాన్ని అందంగా తీర్చిదిద్దుదాం

- మంచి మార్కులు సాధిద్దాం
- జవాబు పత్రాలపై దస్తూరీ కీలకం
- రేపటి నుంచి పదో తరగతి ఇన్‌స్టెంట్ పరీక్షలు



అందమైన చేతిరాత



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ఆలమూరు: నేటి ఆధునిక యుగంలో సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా చేతిరాతకు ఉన్న ప్రాధాన్యం ఏమాత్రం తగ్గడం లేదు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థికి ప్రతి మార్కు అత్యంత విలువైంది. విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు తీవ్రస్థాయిలో సన్నద్ధమైన, సబ్జెక్ట్‌పై పూర్తి పట్టు సాధించినా చేతిరాత సక్రమంగా లేకపోతే మార్కుల పరంగా వెనుకబడే ప్రమాదముంది. ప్రాథమిక పాఠశాల దశ నుంచే అక్షరాలను నేర్చుకోవడంతో పాటు అందంగా, ఆకర్షణీయంగా రాసేందుకు విద్యార్థులకు సరైన శిక్షణ తీసుకోవడం వల్లే దోహదపడుతుంది. దీనివల్ల పైచదువులకు వెళ్లే కొద్ది దస్తూరి మెరుగుపడుతుంది. తద్వారా పబ్లిక్ పరీక్షల్లో అధిక మార్కులు సాధించేందుకు వీలు కలుగుతుంది. మెరుగైన మార్కుల సాధనకు సంపూర్ణమైన విజ్ఞానమే కాకుండా అందమైన చేతి రాత కూడా ఉండాలి. పరీక్షల సమయంలో విద్యార్థుల మెదడులో నుంచి పుట్టే ఆలోచనలు జవాబు పత్రంపై పెట్టేటప్పుడు ఆ అక్షరాలు పేపర్ దిద్దే ఉపాధ్యాయుడికి సరైన విధంగా అర్థమయ్యే రీతిలో ఉంటే చక్కని ఫలితాలను సాధించవచ్చు. ఈ నెల 19 నుంచి 28 వరకూ పదో తరగతి ఇన్‌స్టెంట్ పరీక్షలు జరగనున్నాయి. పోటీ పరీక్షల్లో మెరుగైన మార్కులు సాధించేందుకు చేతి రాత ప్రాధాన్యతను తెలియజేసే విధంగా నేడు విద్యావిధానం ఉండాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

చేతి రాతకు ప్రాధాన్యం ఎక్కువే

నేటి సమకాలీన సమాజంలో మానవ స్వభావానికి, చేతి రాతకు సంపూర్ణమైన అవినాభావ సంబంధం ఉంది. చేతిరాతను బట్టి మనిషి వ్యక్తిత్వం, గుణగణాలు చెప్పొచ్చని పూర్వీకులు చెబుతుంటారు. విద్యార్థికి చేతిరాత మెదడులో సంక్లిష్ట అనుసంధానాల్ని ప్రేరేపిస్తుందని, జ్ఞాపక శక్తిని పెంచుతుందని మేధావులు చేపట్టిన చాలా అధ్యయనాలు బహిర్గతం చేశాయి. దీనివల్ల భావ వ్యక్తీకరణ, భాషా నైపుణ్యాలూ పెరుగుతాయి. ఆలోచనలను చేతిరాతలో పెట్టడం వల్ల సృజనాత్మకత పెరుగుతుంది. అంతటి ప్రాధాన్యం ఉన్న చేతిరాత చదివేవారికి అర్థమయ్యేలా ఉండాలి. ప్రతి అక్షరాన్ని అర్థమయ్యే రీతిలో రాయాలే తప్ప అజంతా శిల్పాల్లా తీర్చిదిద్దాల్సిన అవసరం లేదు.

ఆకర్షణీయంగా చేతి రాత ఉంటే మేలు

- రాసే ప్రతి అక్షరం ఎత్తు, వెడల్పు ఒకే విధంగా ఉండకూడదు.
- పెన్నుతో వేగంగా వేగంగా రాయడానికి సాయంగా ఉంటుందో ముందుగానే కొంత ప్రాక్టీస్‌తో గుర్తించి పెన్నును ఎంపిక చేసుకోవాలి.
- చేతిలో పెన్నును తేలికగా పట్టుకునేలా అలవాటు చేసుకోవాలి.
- పేజీకి 16 నుంచి 20 లైన్లకు మించి రాయకూడదు.
- ఇంగ్లిష్ అక్షరాలు మూడు మిల్లీ మీటర్లు, తెలుగు, హిందీ అక్షరాలు నాలుగు మిల్లీ మీటర్లు పొడవు ఉండేలా రాయడం ద్వారా రాత బావుంటుంది.
- అక్షరానికి అక్షరానికి, పదానికి పదానికి మధ్య తగిన ఖాళీ ఉండేలా జాగ్రత్తపడాలి.
- పెన్ను పట్టుకునే విధానం, కూర్చునే భంగిమ, సమాధాన పత్రాన్ని అమర్చుకునే తీరు రాతను ప్రభావితం చేస్తాయి.
- సున్నా, అర సున్నా, నిలువు గీతల రాయడంపై సాధన చేయాలి.
- పై టిప్‌కు దూరంగా పట్టుకుని రాయడం ద్వారా అక్షరాలు రాసే విద్యార్థికి పూర్తిగా కనిపిస్తాయి.

రాసేటప్పుడు శీర్షికలు, ఉప శీర్షికలను అండర్‌లైన్ చేస్తే బావుంటుంది.

పదో తరగతి పరీక్షల షెడ్యూల్ ఇదీ...

తేదీ	పేపర్
19-5-2025	ఫస్ట్ లాంగ్వేజ్ (గ్రూప్-ఏ) ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-1 (కాంపోజిట్)
20-5-2025	సెకండ్ లాంగ్వేజ్
21-5-2025	ఇంగ్లీషు
22-5-2025	మ్యాథమెటిక్స్
23-5-2025	ఫిజికల్ సైన్స్
24-5-2025	బయోలాజికల్ సైన్స్
26-5-2025	సోషల్ స్టడీస్
27-5-2025	ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2 (కాంపోజిట్) ఓరియంటల్ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1
28-5-2025	ఓరియంటల్ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2 ఎస్సెస్సీ ఒకేషనల్ (థియరీ)

కూటమి పాలనపై తీవ్ర అసంతృప్తి



సోంపల్లిలో పార్టీ నాయకులతో సమావేశమైన కోఆర్డినేటర్ గొల్లపల్లి

రాజోలు: కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి వ్యక్తమవుతోందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శనివారం ఆయన సోంపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. గొల్లపల్లి మాట్లాడుతూ కేవలం ఓట్ల కోసం ప్రజలను మోసగించే హామీలను ఇచ్చి వాటిని అమలు చేయలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. ప్రస్తుతం ప్రజలంతా జగన్ పాలన కోరుకుంటున్నారన్నారు. వైఎస్సార్ సీపీలో సంక్షేమం విరాజిల్లిందని, కూటమిలో అది ఎక్కడా కనిపించడం లేదన్నారు. అన్ని వర్గాలకు ఆర్థిక చేయూతనిచ్చే విధంగా జగన్ సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. నియోజకవర్గంలో సుమారు 350 మందిని వివిధ అనుబంధ విభాగాల్లో నియామకాలు చేయడానికి కసరత్తు పూర్తి చేశామన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డికి నియామకాలు జాబితా అందిస్తామన్నారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో పార్టీ పట్ల విధేయత చూపే వారందరికీ పగ్గాలు అందించి కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటలు చేసేందుకు సిద్ధం చేస్తున్నామన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు, సోంపల్లి సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి కటకంశెట్టి ఆదిత్య, జిల్లా ఉపాధ్యక్షుడు కూనపరెడ్డి రాంబాబు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి తెన్నేటి కిషోర్, నేతల నాని, బందారు కాశీ, ఉచ్చుల దాస్, కట్టా సత్యనారాయణ, కండిబోయిన మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

మాయలతో మభ్యపెట్టడం కూటమికి అలవాటే



గోపాలపురంలో మెర్లపాలెం కార్యకర్తలకు పార్టీ కండువాలు వేస్తున్న జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగ్గిరెడ్డి

జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగ్గిరెడ్డి ధ్వజం

కొత్తపేట: మాయమాటలు చెప్పి, మభ్యపెట్టడం కూటమి నాయకులకు అలవాటేనని, అయినా వారి ఆటలు ఇకపై సాగవని మాజీ ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి హెచ్చరించారు. ఆత్రేయపురం మండలం మెర్లపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలను జనసేన నాయకులు ఏదో మీటింగ్ అని చెప్పి తీసుకెళ్లి బలవంతంగా వారి పార్టీ కండువాలు వేశారు. వారు జనసేనలోకి జాయిన్ అయినట్టు ప్రకటించుకున్నారు. కాగా ఇష్టం లేని జనసేన కండువాలు తీసేసిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు తిరిగి సొంత గూటికి చేరుకున్నారు. ఆ మేరకు వారు రావులపాలెం మండలం గోపాలపురంలో మాజీ ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి స్వగృహానికి స్వచ్ఛందంగా వెళ్లి జగ్గిరెడ్డిని కలిసి తమ మద్దతు తెలిపి, తిరిగి పార్టీలో చేరారు. మాయమాటలు చెప్పినా, ప్రలోభాలకు గురిచేసినా మా పార్టీ వైఎస్సార్ సీపీయేనని, తాము ఎప్పుడూ మీతోనే, మీ వెంటే ఉంటామని జగ్గిరెడ్డి సమక్షంలో స్పష్టం చేశారు. వారికి జగ్గిరెడ్డి వైఎస్సార్ సీపీ కండువాలు వేసి స్వాగతించి, అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు అన్నీ చేస్తామని అరచేతిలో వైకుంఠం చూపిన కూటమి నాయకులు తీరా అధికారం చేపట్టి ఏమీ చేయకుండా ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ప్రజలు మోసపోయామని గ్రహించారని, రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు వీర్రాజు, నాని, సునీల్, చంటి, రామకృష్ణ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మామిడికుదురులో ర్యాలీలో పాల్గొన్న సీఎంఓ సుబ్రహ్మణ్యం

అంబాజీపేట: నివాస, కార్యాలయాల చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. ముక్కామల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా వైద్యాధికారి టి.దివ్యశ్రీ అధ్యక్షతన ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ నెలలో ప్రతి మూడో శనివారం అందరూ తప్పనిసరిగా పరిశుభ్రత కార్యక్రమం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అలాగే అంబాజీపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: ప్రజల భాగస్వామ్యంతోనే స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర సాధ్యమవుతుందని సమగ్ర శిక్ష జిల్లా సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మామిడికుదురులో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పంచాయతీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ప్రతిజ్ఞ చేశారు. ఈదరాడ, లూటుకుర్రు గ్రామాల్లో కూడా ఈ కార్యక్రమం నిర్వహించారు. మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ శ్రామికులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. అలాగే మగటపల్లిలోనూ స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో చీపురు పట్టి పరిసరాలను పరిశుభ్రం చేశారు. చెత్తను పంచాయతీ ఏర్పాటు చేసిన డస్ట్ బిన్లలో మాత్రమే వేయాలన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌తో పల్లెలు పరిశుభ్ర వాతావరణంలో ఆహ్లాదకర రీతిలో ఉంటాయని రామచంద్రపురం ఇన్‌చార్జి డీఎల్‌పీఓ, ఎంపీడీఓ ఎ.రాజు, తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు అన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలన్నీ స్వచ్ఛంగా మారినప్పుడే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం స్వచ్ఛ ఆంధ్రగా మారుతుందన్నారు. అనంతరం పారిశుధ్య నిర్వహణలో లోపాలు తలెత్తకుండా పల్లెలను పరిశుభ్రతకు నెలవుగా మారుస్తామని ప్రతిజ్ఞలు చేశారు. గృహనిర్మాణశాఖ ఏఈ దరణాల శ్రీనివాసు, ఏపీఎం ఎం,ధనరాజు, ఏపీఓ జి.అరుణకుమారి, ఎంఏఓ ఎంఎం,ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వడగాడ్పులపై అప్రమత్తంగా ఉండాలి



ఆలమూరులో ఉపాధి కూలీలకు వడగాల్పుల తీవ్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆలమూరు: ఉపాధి హామీ పథకం కూలీలు పనిచేసే సమయంలో ఎండ తీవ్రత దృష్ట్యా సంభవించే వడగాల్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ రాజు అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ జి.అరుణకుమారితో కలసి శనివారం ఆయన పరిశీలించారు. స్థానిక శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో ఉపాధి కూలీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడం వల్ల ఉపాధి కూలీలు ఉదయం 11 గంటల్లోపు, సాయంత్రం నాలుగు గంటల తర్వాత పనులు చేయాలని సూచించారు. శరీరానికి ఎండ వేడిమి తగలకుండా సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంచినీరు, నిమ్మరసం, మజ్జిగ వంటి చల్లని పానీయాలు స్వీకరించాలన్నారు. తెలుపు రంగు దుస్తులను ధరించడం వలన ఎండ నుంచి కొంత రక్షణ లభిస్తుందన్నారు. అలాగే ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తూ ఎండ నుంచి ఉపాధి కూలీలకు రక్షణ కల్పించేందుకు టార్పాలిన్లతో తాత్కాలిక నీడ ఏర్పాటు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. సర్పంచ్ ఎస్.లావణ్య, ఉప సర్పంచ్ చల్లా సీతామహాలక్ష్మి, కూటమి నేతలు పాల్గొన్నారు.

వ్యాయామంతో రక్తపోటు నివారణ



నగరంలో నిర్వహించిన సైకిల్ ర్యాలీ

మామిడికుదురు: వ్యాయామంతోనే రక్తపోటు నివారించవచ్చని నగరం పీహెచ్‌సీ వైద్యాధికారి స్వర్ణలత పేర్కొన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవంలో భాగంగా శనివారం నగరంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ నడక, సైకిల్ తొక్కడం, వ్యాయామం చేయడం ద్వారా రక్తపోటు సమస్యల నుంచి విముక్తి పొందాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్ మొల్లేటి ఏడుకొండలు, ఏఎన్ఎం సునీత, ఆశ కార్యకర్తలు దుర్గాకుమారి, దివ్య, దుర్గ, సిబ్బంది పాల్గొన్నారు.

చొప్పెల్లలో..

ఆలమూరు: నేటి పోటీ ప్రపంచంలో ఒత్తిడిని అధిగమించడం ద్వారా రక్తపోటును నివారించుకుందామని కొత్తపేట డివిజన్ అదనపు వైద్యాధికారి ఎం.సుమలత అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల్లో వైద్యాధికారులు డి.సాయికిషోర్, ఎన్.లక్ష్మీస్నేహ, బి.అనంత రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తపోటు నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. సమావేశంలో రక్తపోటు నివారణకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. జీవనశైలి, ఆహారపు అలవాట్లను మార్చుకోవడం ద్వారా ఒత్తిడిని తట్టుకోవడం ద్వారా రక్తపోటును అధిగమించవచ్చన్నారు. అనంతరం రక్తపోటు వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. అలాగే చొప్పెల్ల పీహెచ్‌సీలోని పనిచేస్తున్న వైద్య ఆరోగ్య, ఆశ సిబ్బంది నిర్వహించిన సైకిల్ ర్యాలీ విశేషంగా ఆకట్టుకుంది. సీహెచ్ఓ ఎంఎస్ఎస్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పోటీల్లో పలువురి ప్రతిభ



గణపతి సచ్చిదానంద స్వామీజీ నుంచి ప్రశంసాపత్రం అందుకున్న లక్ష్మీహన్విత

సఖినేటిపల్లి: శ్రీమద్ భగవద్గీత పారాయణ పోటీల్లో కేశవదాసుపాలానికి చెందిన చిన్నారి యెనుముల లక్ష్మీహన్విత ప్రతిభ కనబర్చింది. ఈ మేరకు మైసూర్‌లో అవధూత దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ చిన్నారి లక్ష్మీహన్వితను అభినందించారు. బంగారు పతకంతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా భగవద్గీత పారాయణ పోటీలను పీఠం ఆధ్వర్యంలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. భగవద్గీత పారాయణలో ప్రతిభ చూపిన లక్ష్మీహన్వితను గ్రామస్తులు, స్థానిక పెద్దలు అభినందించారు.

కొత్తపేటలో..



మైసూర్‌లో గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ అందుకున్న రాధాకుమారి

కొత్తపేట: మైసూర్ దత్త పీఠంలో జరిగిన భగవద్గీత పోటీల్లో కొత్తపేటకు చెందిన వాసవీ కన్యకా పరమేశ్వరి మహిళా సంఘం ముఖ్య సలహాదారు కంచర్ల రాధాకుమారి గోల్డ్ మెడల్ సాధించారు. దత్త పీఠాధిపతి గణపతి సచిదానంద స్వామీజీ ఆధ్వర్యంలో భగవద్గీతపై పరీక్ష నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా వేలాది మంది పరీక్షకు సిద్ధమయ్యారు. సుమారు ఏడాది పాటు భగవద్గీతలో అన్ని అధ్యాయాలను చదివి ఏ శ్లోకం అడిగినా చెప్పే విధంగా రాధాకుమారి సిద్ధమయ్యారు. అలా ఆన్‌లైన్‌లో 36 టెస్టులు నిర్వహించగా అన్ని టెస్టులతో పాటు ఫైనల్ టెస్టులో కూడా రాధాకుమారి ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత పొంది గోల్డ్‌మెడల్‌కు ఎంపికయ్యారు. శనివారం మైసూర్ దత్త పీఠంలో జరిగిన కార్యక్రమంలో దత్త పీఠాధిపతి గణపతి సచిదానంద స్వామీజీ చేతుల మీదుగా గోల్డ్ మెడల్, సర్టిఫికెట్ అందుకున్నారు.

ప్రమాద బాధితుడి వైద్యానికి సాయం



సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదవశాత్తూ వెన్నెముక విరిగి బాధపడుతున్న బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు శనివారం రూ.13 వేలు వైద్యానికి సాయం అందజేశారు. కొత్తపేట మండలం ఏనుగులమహల్ గ్రామానికి చెందిన దేవరపల్లి వీరరాజు (39) హైదరాబాద్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా చేసుకుంటూ, చెట్లు కొట్టే పని చేస్తూ ఉంటారు. ఈ మధ్య ఒక చెట్టు మీద నుంచి పడి వెన్నెముక విరిగి నడుము నుండి కింద స్పర్శ లేకుండా ఉన్నారు. హైదరాబాద్ నుండి తీసుకువచ్చేసి రాజమహేంద్రవరంలో వైద్యం చేయిస్తున్నారు. ఆపరేషన్ చేయాలని డాక్టర్లు చెప్పారు. ఆర్థికస్తోమత లేక కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో రావులపాలెంలో వీరరాజు మేనల్లుడు పేరూరి దుర్గారావుకి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.13 వేల చెక్కు అందజేశారు.

రావులమ్మ జాతర ప్రశాంతంగా చేసుకోవాలి

అంబాజీపేట: గంగలకుర్రు అగ్రహారం గ్రామదేవత రావులమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్సై కె.చిరంజీవి సూచించారు. స్థానిక అమ్మవారి ఆలయం వద్ద సర్పంచ్ దొంగ నాగేశ్వరరావు అధ్యక్షతన ఉత్సవ కమిటీ నిర్వాహకులతో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ జాతరలో ఎటువంటి అశ్లీల నృత్యాలను ప్రదర్శిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రశాంత వాతావరణంలో అమ్మవారి జాతరను జరుపుకొనేలా అందరూ సహకరించాలన్నారు. అనంతరం గ్రామంలో దొంగతనాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని స్థానికులకు వివరించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో విత్తనాల ఇంద్రశేఖర్, ఎంఎం శెట్టి, బందన రాంబాబు, అడపా బాబ్జీ, అల్లాడ రవి, కట్టా సుబ్రహ్మణ్యం, అడపా సత్తికొండ పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయాలకు భక్తుల తాకిడి




భక్తులతో పోటెత్తిన నల్లచెరువు వేంకటేశ్వరస్వామి ఆలయం

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. చింతలూరు, సంధిపూడి, గుమ్మిలేరు, నర్శిపూడి, జొన్నాడ గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాలను భక్తులు సందర్శించి వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయాల ఆవరణలో గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తిపారవశ్యం చెందారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసి మాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలను నిర్వహించారు. స్థానిక ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

నల్లచెరువులో..

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. స్వామివారి దర్శనం కోసం తెల్లవారుజాము నుంచి భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరారు. వేంకటేశ్వరస్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. స్వామికి తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు జరిపారు. వేదపండితులు స్వామికి లక్షతులసి పూజ నిర్వహించారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయం వద్ద భక్తులకు భారీ అన్నదానం చేశారు. స్వామివారికి భక్తులు పటికి బెల్లం తులాభారం నిర్వహించి మొక్కు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

అర్హులంతా ఇన్సూరెన్స్ చేయించుకోవాలి



లొల్లలో మృతురాలి కుమారునికి బీమా మంజూరు డిక్లరేషన్ ఫారం అందజేస్తున్న బీఎం

కొత్తపేట: ఎస్‌బీఐ ఖాతాదారుల్లో అర్హులు అందరూ పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై ఇన్స్యూరెన్స్ చేయించుకోవాలని ఎస్‌బీఐ ఆత్రేయపురం బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామానికి చెందిన చిట్టూరి లక్ష్మీకాంతం (46) ఇటీవల ప్రమాదవశాత్తూ మృతి చెందగా ఆమె పేరున పీఎంజేజేబీవై ఇన్స్యూరెన్స్ (రూ.436 ప్రీమియం)కు సంబంధించి ఆమె నామిని అయిన కుమారుడు వీరనాగ పోసుబాబుకు రూ.2 లక్షల ఇన్స్యూరెన్స్ సొమ్ము మంజూరయింది. ఆ మేరకు ఇన్స్యూరెన్స్ కంపెనీ నుంచి అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ డిక్లరేషన్ ఫారాన్ని శనివారం నామినీ పోసుబాబుకు ఎస్‌బీఐ ఆత్రేయపురం బీఎం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఈ అమౌంట్‌ను కుటుంబ అభివృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు. గతంలో డీఈఏ ఫండ్ ఆఫ్ ఆర్‌బీఐ, ఎస్ఎస్‌టీ, సీఎఫ్ఎల్ రాజమండ్రి వారి ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశామని ఆ సందర్భంగా లక్ష్మీకాంతం పేరున పీఎంజేజేబీవై ఇన్స్యూరెన్స్ రూ.436 ప్రీమియం కట్టినందు వల్ల నేడు రూ.2 లక్షల ఆర్థిక సాయం అందిందన్నారు. అర్హత గల వారు అందరూ ఈ ఇన్స్యూరెన్స్ స్కీములను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజర్ కె.శ్రీనివాసరావు, ఎస్ఎస్‌టీసీ, ఎఫ్ఎల్ కౌన్సిలర్లు కె.చిట్టితల్లి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దారి కాచి బంగారు గొలుసు చోరీ చేసిన హిజ్రాలు

పి.గన్నవరం: మోటారు సైకిలుపై వస్తున్న ఒక వ్యక్తిని నలుగురు హిజ్రాలు ఆపి అతని మెడలోని బంగారు గొలుసు చోరీ చేసిన ఘటనపై శనివారం రాత్రి కేసు నమోదు చేసినట్టు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. గత నెల 26న మండలంలోని బూరుగులంకకు చెందిన అద్దాల నరసన్న పెట్రోలు కోసం తన మోటారు సైకిలుపై బెల్లంపూడిలోని బంకు వద్దకు వస్తున్నాడు. దారిలో చింతావారిపేట వద్ద అతడిని నలుగురు హిజ్రాలు ఆపారు. అతని మెడలోని సుమారు రెండు కాసుల బంగారు గొలుసు లాక్కుని, కారులో పరారయ్యారు. దీంతో బెంగ పెట్టుకున్న నరసన్న ఈ విషయం ఎవరికీ చెప్పలేదు. దిగాలుగా ఉన్న అతడిని స్థానికులు ప్రశ్నించే సరికి అసలు విషయం చెప్పాడు. దీంతో స్థానికుల సాయంతో అతడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివకృష్ణ వివరించారు.